

# రోగాలు - అనురోగాలు

## - డా.కె.వివేకానంద మూర్తి



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*




'మీరు?'

'నేను కూడా తడిసిపోతున్నాను.'

'గొడుగులేదా సార్?'

'నేను బైల్దేరేముందు వానలేదు. గొడుగు అవసరం వస్తుందనుకోలేదు.'

'ఎక్కడికి బైల్దేరారు?'

'కురుపాం మార్కెట్‌కి'

'కురుపాం మార్కెట్టా?'

'అవును. కురుపాం మార్కెట్. అక్కడ కురుపాం టూంబ్ వుంది. అందుకే ఆ పేరు. కురుపాం రాజావారు వారి రాణీ లక్ష్మి నరసాయమ్మగారి కోసం 1905లో కట్టించిన స్మృతి చిహ్నం. గొప్ప శిల్పకళ వుట్టిపడేలా బాగా యెత్తుగా కట్టించారు. కురుపాం విజయనగరం దగ్గర వుంది. ఆయన పాలన విశాఖంతా వుండేది. ఇప్పుడా కురుపాం టూంబ్ కాంపౌండంతా కూరగాయలమ్మే కురుపాం మార్కెట్ అయింది.' ప్రొఫెసర్‌గారు ఆగారు.

'యింకా చెప్పండి సార్' అన్నాడు బాలరాజు.

'సరే నేను కురుపాం మార్కెట్లో గుత్తొంకాయలు బావుంటాయని కొందామని బైల్దేరాను. ఈలోగా వానముంచుకొచ్చింది' అవును ఇదంతా నీకెందుకు చెబుతున్నాను.

'పాహియాన్ సర్.'

'యెస్. పాహియాన్ గాడు. వాడు నలుగురి ముందూ నన్ను నాన్నా! అని పిలిచాడు. నలుగురూ నానా విధాలుగా అనుకుంటారు. నీ చేతిలో బి.టి ఫిజియాలజీ టెక్స్ట్ బుక్ చూశాక నీమీద నాకేదో అపరితమైన ఆత్మీయభావం కలిగింది. జరిగిందంతా నీకు చెప్పాలనిపించింది.'

'థాంక్యూ సర్! చెప్పండి'

'ఆఁ ఎక్కడిదాకా వచ్చాను.'

'అనుకోకుండా వానొచ్చింది సర్. ఆ వానలో మీరు తడిసిపోతున్నారు.'

'అవును. తడిసిపోతున్నాను. చెంగ్రలావు పేటలో వుంటే గుత్తొంకాయలు మర్నాడు కొనుక్కునే వాణ్ణి కదా అనుకున్నాను. కానీ చెంగ్రలావు పేటలో వుంటే రాత్రిళ్లు బాగా యిబ్బంది అయ్యేది. అందుకే ఎప్పుడూ అక్కడ వుండదల్చుకోలేదు.'

బాలరాజు ప్రశార్ధకంగా చూశాడు.

'చెంగ్రలావు పేటలో రాత్రిపూట నడిచే మనుషుల్ని పోలీసులు స్నేకులై కరుస్తారు. బాకులై పొడుస్తారు. ఎందుకంటే అక్కడ సంసార గృహాల మధ్య సానికొంపలున్నాయి. షిప్పులోంచి దిగే గ్రీకులకీ, రష్యా వాళ్లకీ, యింకా రకరకాల విదేశీ సరంగులకీ, సైలర్సుకీ సుఖ సరఫరా చేస్తూవుంటాయి. ఓసారి మన డిమాన్‌స్ట్రేటర్ భాస్కర్రావుని సెకండ్ షో సినిమా నుంచి తన యింటికి వస్తూంటే పోలీసులు పట్టుకుని సానికొంపనుంచి వస్తున్నావని ఆటకాయించి బెదిరించి జేబులు ఖాళీ చేసార్ట. దేశానికి స్వాంతంత్ర్యం వచ్చాక పోలీసు పీనుగుల్లో మొదలైన లంచాలు క్రమంగా అంతటా వ్యాపిస్తున్నాయి. మరో నలభై యేళ్లకు మన దేశమంతా లంచగొండి తనంతో మండిపోతూ ప్రపంచంలో ప్రధమస్థానం ఆక్రమిస్తుంది' ప్రొఫెసర్ ఆగారు.

మళ్లీ అన్నారు 'చూడు బాలరాజూ! మనకి లేట్ అవుతున్నట్టుంది. కదుల్దాం. అలా హాస్పిటల్ ఓ.పి గేటు దగ్గరున్న పావన్ బేకరీకి వెళ్లి ఒక బొంబే టోస్టు తింటూ మాట్లాడుకుందాం' అని లేచారు.

ప్రొఫెసర్‌గారు అటెండర్‌కి డిపార్ట్‌మెంట్ క్లోజ్ చైమని చెప్పి, బాలరాజుని వెంటబెట్టుకుని పావన్ బేకరీకి కదిలారు.

'చూడు బాలరాజూ! అనుకోకుండా నిన్నివాళ చాలాసేపు నాతో వుంచేశాను. పాహియాన్ సంగతి నీకు పూర్తిగా చెబితేగాని నాకు నిద్రపట్టదు. నీ ముందు వాడు నన్ను 'నాన్నా!' అని పిలిచాడు. నీకెందుకో చెప్పకపోతే రూమర్స్‌తో నా శీలం దెబ్బతింటుంది.'

'నేనెక్కడా అననండి' అన్నాడు బాలరాజు.

'నువ్వనవనుకో. అయినా నా మైండ్ క్లియరవదు. అంచేత అంతా విను. పావన్ బేకరీలో బొంబే టోస్టలా వుంటుంది' అన్నారు ప్రొఫెసర్‌గారు. ఆయన మళ్లీ కంటిన్యూ చేశారు.

'సరే మరి కురుపాం మార్కెట్ దగ్గర వానలో నేను అలా తడిసిపోతుంటే, నా పక్కనే గూడు కవర్ చేసిన వొక రిక్షా వచ్చి ఆగింది.

"తడిసి ముద్దయిపోతున్నారు ఎక్కండి బాబూ అన్నాడు రిక్షావాడు తను అప్పటికే బాగా ముద్దయిపోయి. నేను యెక్కడికి, యేవిటీ అని అడక్కుండా రిక్షా యెక్కాను. యెక్కీ యెక్కగానే కంగారు పడ్డాను. ఎందుకంటే ఆల్‌రెడీ వొక శాల్తీ లోపల కూర్చునుంది. పెద్దాయన తడిసిపోతున్నారు. 'కుసింత సోటెట్టమ్మా' అన్నాడు రిక్షావాడు. 'కంగారొద్దు సారూ. లపాకీ కాదు. ఫ్రేమిలీ' అని కూడా నన్ను వుద్దేశిస్తూ అన్నాడు. లోపల కూర్చున్నది చైనా వనిత. జరిగి నాకు చోటిస్తూ ' వో అయ్ నీ 'అంది. అది చైనా గ్రీటింగనుకుని నేను కూడా 'వో అయ్ నీ' అన్నాను కూర్చుంటూ. సెలెక్ట్ టాకీసుకి మాట్టాడుకుందండి. తవర్ని కూడా అక్కడ దింపైమంటారా, యెక్కడికేనా యెల్తారా' అడిగాడు రిక్షుడు. నాకేవీ తోచక 'అక్కడ దింపెయ్ ముందు. వర్షం తగ్గేదాకా హాల్లో కూచుంటాను' అన్నాను.

'అదే రైటండి. సెలెట్టాకీసులో ఏ సినేమా అయినా యిద్దరు కలిసి చూడాలండి. హాల్లో స్తంభాలడ్డు కదండీ. యిద్దరు కలిసి సూత్తేగానీ బొమ్మేటో తెల్దండి' అన్నాడు. రిక్షాలో మనిషి మళ్లీ 'వో అయ్ నీ' అంది నేను కూడా మళ్లీ 'వో అయ్ నీ' అని, పేరేంటన్నాను. ఆమెకి తెలుగొచ్చు. ' లూలీలింగ్' అంది. రిక్షా సెలెక్ట్ టాకిసు దగ్గర ఆగింది. రిక్షా అతనికి చిల్లరిచ్చి నేనూ లూవీవింగ్.

సెలెక్ట్ టాకీసు దగ్గర దిగాం. ఆ హాల్లో పాత సినిమా ఝునక్, ఝునక్ పాయల్ బాజే ఆడుతోంది. డాన్సులు చూట్టం యిష్టమా అని అడిగాను. లూలీలింగ్ అవునంటూ టింగ్ మని గంట మోగినట్టు నవ్వింది.

బాలరాజు, ప్రొఫెసర్ గారు సావన్ బేకరి చేరారు. బేకరీ మేడమీద గదిలో కూర్చుని బోంబే టోస్ట్ ఆర్డరిచ్చారు. ప్రొఫెసర్‌గారు కొనసాగించారు.

'సినిమా అయ్యాక ఆఖరి బస్సేదో యెక్కి యిద్దరం యెల్లమ్మ తోట దగ్గర దిగాం. 'మా యిల్లు దగ్గరే. కాఫీ తాగి వెళ్లండి' అంది లూలీలింగ్. రోడ్డు మీద జనం బాగా తగ్గిపోయారు. సరే తనకి యింటిదాకా సాయం యిచ్చినట్టు వుంటుందని అలాగే అని ఆమెతో వాళ్లింటికి నడిచాను. ఆమె వొక్కతే ఉంటోంది. కాఫీకి ముందు చౌమీన్ పెట్టింది. 'వో అయ్‌నీ' వో అయ్ నీ'అంటూ నాకేసి యిష్టంగా చూసింది. నేను కూడా 'వో అయ్ నీ' అని అలాగే చూశాను. ప్రొఫెసర్‌ని కదా సభ్యతగా వుండాలనుకున్నాను. కానీ యిష్టానికి సభ్యతలుండవు. ఇద్దరం ఝునక్ ఝునక్ పాయల్ బా జే చిత్రంలో భంగిమల్ని కావలిసినట్టు లొంగదీసుకున్నాం. ఎంతసేపయిందో ముందు తెలియలేదు. కానీ చాలాసేపయిందని తర్వాత తెలిసింది.

బోంబే టోస్టు వచ్చింది. ఇద్దరూ తిన్నారు. తర్వాత కాఫీ చెప్పారు.

' లూలీలింగ్‌కి 'వస్తా' అని చెప్పి కదిలాను. వచ్చేస్తూ అడిగాను ' వో అయ్ నీ' అంటే ఏవిటని చైనా భాషలో ' వో అయ్ నీ ' అంటే ఐ లవ్ యూ అని అర్థంట. అర్థం కాకుండానే ఆమెకు చాలాసార్లు ఐ లవ్ యూ చెప్పానని అర్థమైంది. అందుకే మేం తొందరగా దగ్గిరయి మా పరిచయం ఝునక్ ఝునక్‌మంటూ వూగిపోయింది. ఆ తర్వాత లూలీలింగ్‌ని చాలాసార్లు కలిశాను. ఆమె వొంటరిగా వుండేది. మొగుడు బుద్ధుడిని చూడడానికి భూటాన్ యాత్రకు వెళ్లేడుట. ఆ తర్వాత యేడాదికి గానీ తిరిగిరాడుట.

- నేనూ వొంటరినే. రాత్రీ పగలూ ఫిజియాలజీ డిపార్ట్‌మెంట్‌లో కప్పలతో కాపురం చేస్తున్నానని మా ఆవిడ అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది.'

బాలరాజు అచేతనంగా వింటున్నాడు. ఇద్దరూ కాఫీ పూర్తిచేశారు.

'అప్పుడే లూలీలింగ్‌కి ఫాహియాన్ పుట్టాడు. నెమ్మదిగా పెరిగాడు. వాడి చదువుకి యెంతో సాయం చేశాను. వాడు బ్రిలియంటేం కాదు. చదువు అయిందనిపించాక, వాడికెక్కడా పని దొరకలేదు. నా ఫిజియాలజీ డిపార్ట్‌మెంట్‌లో అటెండర్ వుద్యోగం వేయించాను.'

'మరి ఫాహియాన్ సిస్టర్ చాంగ్ చాంగ్ మావ్?' అడిగాడు బాలరాజు.

' లూలీలింగ్‌తో నా పరిచయం అయిన తర్వాత ఏడాది తిరక్కుండానే బాగా ముందే ఆమె భర్త హ్యూన్ త్సాంగ్ బుద్ధుడిని చూసి భూటాన్ నుంచి తిరిగి వచ్చేసాడు. ఆ తర్వాత ఫాహియాన్‌కి సిస్టర్ పుట్టింది. ఫాహియాన్ కూడా తన కొడుకే అనుకుంటాడు. హ్యూన్‌త్సాంగ్. అదేవిటంటే వాడు చైనా క్యాలండర్ ఫాలో అవుతాడని చెప్పింది లూలీ. సరే మరి ఈ ఫాహియాన్ గాడికి డిపార్ట్‌మెంట్‌లో అటెండర్ జాబ్ వేయించాను కదా.'

'వేయించారు' బాలరాజు.

'మరి వాడు తిన్నగా వుండి ఛస్తేనా - వాడు చేరిన దగ్గర్నుంచీ డిపార్ట్‌మెంట్‌లో కప్పలు మాయమైపోవడం మొదలైంది. కప్పలు జాలరి పేట వాళ్లు సప్లై చేసేవారు. ఈ ఫాహియాన్ గాడి మూలంగా తెప్పించుకునే కప్పలు చాలేవి కాదు. అంచేత యెక్కువ తెప్పించుకోవాల్సి వచ్చేది. ఓసారి ప్రిన్సిపాల్ నన్ను నిలదీసి అడిగాడు 'నీ బోడి ప్రాక్టికల్స్‌కి యెందుకయ్యా నీకిన్ని కప్పలు?' అని.

'ఆ కప్పలు ఫాహియాన్ మాయం చేస్తున్నాడని మీకెలా తెలిసింది?' బాలరాజు అడిగాడు.

‘బలేవాడివి బాలరాజూ! పొలిటీషియన్‌కి అవినీతి యిష్టమనీ, పోలీసాడికి లంచాలు యిష్టమనీ, చైనావాడికి కప్పలు యిష్టమనీ వేరే తెలియాలా? అదీగాక అంతవరకూ ఏ సమస్యా లేనిది, సరిగ్గా వీడు జాయిన్ అవగానే కప్పలు అదృశ్యం అవడం ఏవిటి అందుకే పాహియాన్ గాడే దోషి అని తెలిసిపోయింది. వెంటనే వాడిని పిలిచి చెప్పేశాను. కొడుకువని ప్రేమతో చేరదీశాను. తండ్రినైన నాకే ద్రోహం తలపెట్టావు. నువ్విక నా కొడుకువీ కాదు. నేను నీకు తండ్రినీ కాను. లూలీలింగ్ యెంతో బతిమాలింది. కానీ ఫిజియాలజీ డిపార్టుమెంట్ పతనమైపోతుంటే యెలా సహించగలను. అంచేత మనస్సు రాయిచేసుకుని, పాహియాన్‌ని బైటికి పంపించేశాను. అందుకే యివాళ మధ్యాహ్నం వాడు ‘నాన్నా‘ అని పిలిస్తే సహించలేకపోయాను. ఇదీ సంగతి బాలరాజూ. ఇప్పుడు నీకు నిజం తెలిసింది. నా మనసు తేటపడింది. నిన్ను నాతో చాలాసేపు వుంచేశాను. నడు వెళ్దాం.‘ అని ప్రొఫెసర్ గారు లేచారు.

బాలరాజు కూడా లేచాడు.

పావన్ బేకరీ మెట్లు దిగి మళ్లీ కలుద్దామని యిద్దరూ తమ నివాసాలకు నిష్క్రమించారు.

బాలరాజుకి ఫిజియాలజీ ప్రొఫెసర్‌గారి తీరు ఆయన తనతో తన సొంత విషయాలు పంచుకోవడం ఆలోచించిన కొద్దీ అంతు చిక్కలేదు. బాచిలర్స్ డెన్ చేరాక జరిగిందంతా తానీషాతో చెప్పాడు. తానీషా ‘నువ్వు అదృష్టవంతుడివి గురూ. ఎవరితోనూ షేర్ చెయ్యని షేర్‌ఖాన్‌లాంటి ప్రొఫెసర్‌గారు నీతో ఎన్నో పెర్సనల్ మేటర్స్ షేర్ చేసుకున్నారు. నీకు ఫిజియాలజీ ఎగ్జామ్ ప్రాబ్లమే లేదు. ‘

‘కానీ పాపం పాహియాన్ గురించే ఆలోచిస్తున్నాను‘ అన్నాడు బాలరాజు.

‘చైనా వాడిగురించి ఏంచైనా అని నువ్వు ఆలోచించడం అనవసరం. చెడైనా, మంచైనా అది ప్రొఫెసర్‌గారి హెడేక్కు. పాహియాన్‌కి హెల్పు చైనా అనుకుంటే అది తర్వాత ఆలోచించు. డిన్నర్ రెడీ అయినట్టుంది. కమాన్ - లెటజ్ యీట్ ఫుడ్‘ అన్నాడు తానీషా.

‘ప్రొఫెసర్‌గారి చైనా ప్రేమ యేదో దైవ సంకల్పంలా వుంది‘ అన్నాడు బాలరాజు.

‘కాదు. అంతా ఝునక్ ఝునక్ పాయల్ బాజే మహాత్మ్యం‘ అన్నాడు తానీషా.

‘అన్నట్టు అడుగుదామనుకుంటూనే మర్చేపోతున్నాను. తానీషా నీకు దేవుడంటే నమ్మకం లేనట్టుంది. ఎప్పుడూ నమాజు చైడం చూడలేదు.‘

‘బలేవాడివే బాలరాజూ! నేను ముస్లిమ్‌ని కాదు. మా నాన్న రామభక్తుడు. నాకసలు రామదాసు పేరు పెడదామనుకున్నాట్ట ముందు. కానీ శ్రీరాముడు రామదాసుకి కాకుండా, తానీషాకు కనిపించాడు. అంచేత నేను తానీషా అయిపోయాను‘ అని విపులీకరించాడు తానీషా.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

